# త్రికరణశుద్ధిగా ఉండండి

సకల విద్యలు నేర్చి సభజయించగవచ్చు
శూరుడైరణమందు పోరవచ్చు
రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు
హేమగోదానము లీయవచ్చు
గగనమందున్న చుక్కల లెక్కగొనవచ్చు
జీవరాసుల పేర్లు చెప్పవచ్చు
అష్టాంగవిద్యల నభ్యసింపగవచ్చు
చంద్రమండలమైన చేరవచ్చు
కాని దేహేంద్రియములరి కట్టి ఎపుడు
మనసు నిల్పి యంతర్ముఖముగను జేసి
నిశ్చల సమాధి చిత్తుడై నిలువలేడు.

రిత్తకోరికలను మోపు ఎత్తుకొనుచు
తిరుగుచున్నారు నిజరూపు తెలియలేక
తిలలయందున తైలంబు వెలయునటుల
దేవుడున్నాడు నీలోన తెలియరయ్య!

ప్రేమ స్వరూపులారా!

శరీరములో, గగనాకాశమందు ఎండనీడలువలె, జీవుడుతో దేవుడు నివసించుచున్నాడు. ఎండనీడలు ఒకదానిప్రక్కన ఒకటి, ఒకదానితో ఒకటి అవినాభావ సంబంధమై, అన్యోన్యాశ్రయమై ఉంటున్నవి. అటులనే జీవుడు దేవుడు ఒకదానినొకటి అనుసరించి అన్యోన్యాశ్రయమై, అవినాభావ సంబంధముతో హృదయములో నిలిచి ఉన్నవి. నీడలు వేరు

sri sathyasai vachanamrutam

వేరు రూపములుగా ఉండినప్పటికిని ఎండ ఒక్కటిగానే ఉంటుంది. అటులనే జీవులు వేరు వేరు రూపములుగా కన్పించుచున్నప్పటికిని దైవము ఒకటిగానే ఉంటున్నాడు. జీవులకు ఉపాధి పరిమితి. దేవుడు సర్వాంతర్యామి, ఉపాధి రహితుడు. ఇట్టి నిజతత్త్వమును గుర్తించి అనుభవించి, ఆనందించి జగత్తున కందించే నిమిత్తమై ఆనాటి ప్రజలు యజ్ఞయాగాది క్రతువులు ప్రారంభించారు.

దేహమునకు ఇంద్రియములు ప్రధానము. ఈ ఇంద్రియములకంటె కూడ ఇంద్రియ భావములు అత్యంత బలవత్తరమైనవి. శబ్ద స్పర్శ రూప రస గంధాదులు. ఈ ఇంద్రియములన్నింటికంటే వాగింద్రియము మహాశక్తివంతమైనది. ఈ ఇంద్రియములన్నింటికి అధిపతి మనస్సు. మనస్సుకు అధిపతి బుద్ధి. బుద్ధికి అధిపతి జీవుడు. జీవునికి అధిపతి దేవుడు. ఇంద్రియములు మనస్సుతో చేర్చి మనస్సును బుద్ధితో కలిపి బుద్ధిని జీవముతో చేర్చినప్పుడే ఈ జీవబ్రహ్మములయొక్క ఐక్యత మనకు అర్థమవుతుంది. ఇంద్రియములన్నింటి కంటే జిహ్వేంద్రియము మహాశక్తివంతమైనది. ఒక్క జిహ్వేంద్రియాన్ని మనము వశం చేసుకుంటే సర్వేంద్రియములు కూడా వశమైపోతాయి. ఈ జిహ్వేంద్రియము తినటము, మాట్లాడటము చేస్తుంది. ఈ జిహ్వేంద్రియమును మనస్సుతో చేర్చినప్పుడు ఈ మాటలు నిల్చిపోతాయి. అప్పటినుండి మనసు మాట్లాడటం ప్రారంభిస్తుంది. మనసు మాటలను నిలిపివేయుటకై బుద్ధిని హెచ్చరించాలి. బుద్ధిని మేలు కొలిపినప్పుడు మనసు మాటలు నిలిపించి ఈ మనసుబుద్ధితో ఐక్యంగావించుకుంటుంది. ఇంద్రియములు మనస్సుతో మనస్సు బుద్ధితో చేరినప్పుడు బుద్ధికి బుద్ధి చెప్పి ఈ బుద్ధిని జీవము వైపుకు మరల్చే ప్రయత్నం మనం చేయాలి. ఈ బుద్ధిని జీవము వైపునకు మరల్చినప్పుడే ఈ జీవము బ్రహ్మముతో ఐక్యమైపోతుంది. ఇది సరైన సాధన.

కాని ఇట్టి సక్రమమైన సాధనను గుర్తించుకొనలేక నిరంతరము భోగభాగ్యముల నిమిత్తము, ఆశల నిమిత్తము బాహ్యమైన దృష్టిని అభివృద్ధి గావించుకుంటున్నాడు మానవుడు. బహుశ ఇది వీరి తప్పుకాకపోవచ్చు. ఇంద్రియములన్నికూడా బహిర్ముఖమై ఉంటున్నాయి. కన్నులు బహిర్ముఖమే. చెవులు బహిర్ముఖమే. నోరు బహిర్ముఖమే. ముక్కు బహిర్ముఖమే. ఈ ఇంద్రియములన్నీ బహిర్ముఖముగా ఉండటం చేత మానవునియొక్క తత్త్వము బహిర్ముఖములో

sri sathyasaivacharamrutam

అభివృద్ధి గావించుకుంటున్నది. అయితే ఈ అంతర్బహిర్ముఖములకు ఒక అవినాభావ సంబంధమున్నది. బాహ్య ప్రపంచమునకు, అంతర్లోకమునకు ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి మానవుడు. అందాన్ని చూసి ఆనందించేది, ఆహారాన్ని చూసి ఆస్వాదించేది పరిమళాన్ని చూచి పరవశించేది దేహమా లేక మనసా? చక్కగా విచారణ సలిపినప్పుడు ఆత్మనే ఇవన్నీ అనుభవించుచున్నది కాని దేహము కాదు. ఇట్టి ఆత్మానందమును అనుభవించటమే మానవుని ప్రధాన కర్తవ్యము.

**అంతటా ఆనందమే**

బాహ్యదృష్టికి మూలము, అంతర్దృష్టికి ఆది ఆత్మనే. ఈ ఆత్మానందమంటే ఏమిటి? సర్వసౌకర్యములతో తులతూగుచు, దేహసంబంధమైన పుష్టి సంతుష్టి పురస్కరించుకొని మానవుడు ఆనందిస్తూ ఉంటాడు. ఆ ఆనందము మానవునికి అత్యంత ఆనందముగా గోచరిస్తుంది. కానీ ఈ ఆనందముకంటె నూరురెట్లు అధికమైనది గంధర్వానందము. ఈ గంధర్వానందము కంటే దేవానందమనేది మరింత నూరురెట్లు ఆనందమైనది. ఈ దేవానందముకంటె దేవేంద్రుని ఆనందము మరింత నూరురెట్లు అధికమైనది. ఈ దేవేంద్ర ఆనందము కంటే నూరురెట్లు అధికమైనది ఇంద్రానందము. ఇంద్రానందముకంటే నూరురెట్లు అధికమైనది ప్రజాపతి ఆనందము. ఈ ప్రజాపతి ఆనందముకంటే నూరురెట్లు అధికమైనది ఆత్మానందము. ఇట్టి మానవానందము ఆత్మానందమును పోల్చి చూచినప్పుడు ఈ దేవానందము, లోకానందము, మానవానందము ఎంతటిది. అల్పమైన విషయములతో, అల్పమైన భావములతో మనము ఆనందించే ఆనందమునే మనం మైమరచిపోతున్నాము. ఇట్టి పవిత్రమైన ఆత్మానందములో మనము మునిగినప్పుడు ఇంక ఏమిటి మనం జ్ఞప్తియందుంచుకోగలము. సర్వము కూడా మరచి ఆ ఆనందములోనే మన జీవితము అంకితమైపోతుంది. ఈ ఆత్మానందమే బ్రహ్మానందము. ఈ ఆత్మానందమే అద్వైతానందము. ఈ ఆత్మానందమే పరమానందము. ఈ ఆత్మానందమే యోగానందము. కనుక ఈ ఆనందము లేని స్థానము ఈ లోకములో కానరాదు. సమస్త పదార్థములందు ఈ ఆనందము అంతర్భూతమై ఉంటుంది. దీనినే త్యాగరాజు చెప్పాడు.

**చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో**
**ప్రేమ మీరవెలసి యుండె బిరుదువహించిన**
**సీతారామ నన్నుబ్రోవరా...**

చీమనుండి బ్రహ్మవరకు ఉండినటువంటి నీతత్త్వాన్ని ఏరీతిగా వర్ణించాలి. అని సమస్త జీవులందు ఈ దేవానందమున్నదని త్యాగరాజు తనసాధనా సంపత్తి వలన గుర్తించుకోగలిగాడు.

ఈ బ్రహ్మతత్త్వమనేది మనం ఏరీతిగా గుర్తించాలి? ఇక్కడ మానవత్వమనేది ప్రకృతికి సంబంధించినది. ప్రకృతికి రసము జలము. జలమునకు ఫలితము సస్యము. ఆసస్యమునకు ప్రతిరూపము పురుషుడు. ఈ పురుషునియొక్క రసము వాక్కు. వాక్కుయొక్క భావము ఋక్కు. ఋక్కుయొక్క సౌందర్యమే సామము. సామముయొక్క రసస్వరూపమే ఓం. ఈ ఓం తత్త్వమనేది ఎక్కడనుండి ఆవిర్భవించినది. విచారణ చేస్తే పృథ్వినుండియే ఆవిర్భవించింది. ఈ పృథ్వియందున్న సమస్త పదార్థములు ఈ ఓంయొక్క శబ్దముతోనే నిండిఉంది. శబ్దమంతయూ కూడను ప్రణవనాదమే. కనుకనే ఏ నామము చెప్పవలెనన్నను ఓంను ప్రథమంగా ఉంచుకొని తద్వారా నామమును ఉచ్చరిస్తూ వస్తున్నారు. ఈ ప్రణవనాదమే లేకపోతే ఇందులో పృథ్వికి ఏమాత్రము విలువలేదు. ఈ ఋగ్వేదము కూడను ఈ సామవేదమునందే అంతర్భూతమై ఉంటున్నది. సా, మ, అనే రెండక్షరములు. సా అనగా పృథ్వి. అమ అనగా అగ్ని. స+అమ=సామ. అగ్ని ఋగ్వేదముయొక్క సారము. పృథ్విసామ వేదముయొక్క సారము. ఏతావాతా ఋగ్వేద సామవేదములు రెండూకూడా సామవేదములోనే అంతర్భూతమై ఉంటున్నవి.

ఈ ఓంకు ఉద్గీత అని ఒక పేరు. ఉది అనగా ప్రాణము. గీ అనగా వాక్కు. త అనగా అన్నము. ఏతావాతా ఆత్మ, మనసు, శరీరము ఈ మూడింటియందు అంతర్భూతమైన తత్వమే ఈ ఓం. దీనినే ప్రజ్ఞ అన్నారు. ఆత్మ మనస్సు, శరీరము అందరియొక్క ఆకారమే. ఈ మూడును లేని ఆకారము పృథ్వియందు కానరాదు. కనుక ఓంకారమనేది మనయొక్క ఆకారమే కాని వికారము కాదని గుర్తించి వర్తించాలి. ఏకత్వమును ప్రబోధించే తత్త్వమే వేదముయొక్క సారము. సమస్తము ఈ ఓం అనే బ్రహ్మమునుండే ఆవిర్భవిస్తూ వస్తున్నది. పుట్టుట పెరుగుట నశించుట

sri sathyasai vachanamrutam

ఈ అన్నింటికికూడా ఒక్క బ్రహ్మతత్త్వమే మూలాధారము. 'తత్ జలాత్' అని వేదములో ఒక పదము. ఇదియే బ్రహ్మసూత్రముయొక్క ప్రధానసూత్రము. తత్ అనగా దానినుండి, జ-అనగా జన్మించటము. ల- అనగా లయమొందటము. త-అనగా అభివృద్ధి గాంచటము. తత్‌జలాత్ అనగాయేమి? దేని నుండి పుట్టినదో, దేనిలో లయమగుచున్నదో దానినుండి ఏ అభివృద్ధిగాంచుచున్నది. ఇట్టి మహా పవిత్రమైన సూత్రములు వేదమునందు ఇమిడి ఉండినప్పటికి దీనిని సరైన మార్గములో అందించే మహనీయులు లేకపోవటంచేత, అర్థము కాకపోవటంచేతను వీటినన్నిటిని అనర్థములుగా భావించి యదార్థములను మరుగు పరచి అనర్థాలనుపెంచుతూ వచ్చారు.

**మానవ జీవితమంతా యజ్ఞమయమే**

ఏతావాతా మానవుని జీవితమంతయు యజ్ఞమయమే. మానవుడు చేసే సర్వకర్మలకు మూడుకాలములుంటున్నాయి. ప్రాతఃకాలము, మధ్యాహ్నకాలము, సాయంకాలము. మన జీవితములో ప్రాతఃకాలమనేది 24 సంవత్సరములుగా ఉంటుంది. అనగా కేవలము ఒక దేహముయొక్క తత్త్వమునేగాక, విద్యావిధానమును భావములను, భవిష్యత్తుయొక్క విషయములను తలయందుంచుకొని తద్వారా నిరంతరము కర్మలనాచరించే ఉత్సాహప్రోత్సాహములే ఈ ప్రాతః సమయముయొక్క అంతరార్థము. ఇది బాల్యస్థితియని కూడను చెప్పవచ్చును. రెండవది మధ్యాహ్న సమయము. అది 44 సంవత్సరములు. ఇంక సాయంసమయమనేది 48 సంవత్సరములు. అన్నీ చేరి 116 సంవత్సరములు మానవునియొక్క జీవితము. 116 సంవత్సరములు జీవించవలసిన మానవుడు ఏకొద్ది కాలములోనే మరణిస్తున్నాడంటే దీనికి కారణమేమిటి? మానవుడు తన జీవిత విధానములో అనుసరించవలసిన మార్గములు తప్పి అపమార్గములు పట్టి తన ఆరోగ్యమును చెడుపు కొని జీవితమును క్షీణింప చేసుకుంటున్నాడు. జీవితముయొక్క విధానము మానవునియొక్క హృదయములో ఇమిడి ఉంటున్నది. ఈనాటి మానవుడు విచారము, అపనమ్మకములకే తన జీవితమును అంకితము గావించుకుంటున్నాడు. ప్రపంచమంతముకూడా భగవంతునియొక్క స్వరూపమే. ఇలాంటి ప్రపంచమునందు ఉండినటువంటి సమస్త పదార్థములుకూడా

srisathyasaivachanamrutam

బ్రహ్మస్వరూపమే.

నిజముగా నీవు భగవంతుని ఇష్టపడిన వాడవైతే, ప్రేమించినవాడవైతే ఈ ప్రపంచము నందుగల సమస్త పదార్థములను ప్రేమించాలి. దేనినీ ద్వేషించరాదు. ఎవరినీ పరిహసించరాదు. ఎవరినీ దూషించరాదు. ఎవరినీ బాధించరాదు. ఇవి భగవంతునియొక్క స్వరూపములే. ఇట్టి భావముతో మానవుడు తన జీవితమును గడిపినప్పుడు పూర్ణాయుష్మంతుడై పూర్ణత్వాన్నికూడా అనుభవించగలడు. కాని ఈనాటి మానవుడు సంకుచిత భావములనభివృద్ధి గావించుకొని నా నీ అనే భేదములచేత జీవితమును మధ్యకాలములోనే అంత్యము గావించుకుంటున్నాడు. అయితే అన్నింటిని తనదిగా భావించవచ్చు కాని దేనియందు అభిమానము పెంచుకొనరాదు. నా ఆవు ఈనింది. నా దూడకు దెబ్బ తగిలిందని నా ఆవు, నా దూడ అనే అభిమానం చేత దానిని పోషిస్తున్నాడు. కాని అతనికి తెలుసు ఇది నాది కాదని. తనది కానప్పటికి తనదిగా భావించి దానిని పోషిస్తున్నాడు. అదేవిధముగానే ఈ జగత్తునందున్న సమస్త పదార్థములు నీవి కానప్పటికిని నీవిగా భావించి దానియొక్క పోషణ నీవు చేయటానికి తగిన కృషి సల్పాలి. పోషణ చేయనక్కరలేదు. దాని పోషణకి అడ్డు తగలకుండా ఉంటే అదే చాలు. అదియే 18 పురాణములందు ఉన్నటువంటి మహాసారము. రెండు వాక్యములు. Help ever, Hurt never పరోపకార పుణ్యాయ పాపాయ పరపీడనమ్. నీవు సాయం చేయకపోతే ఫరవాలేదు కీడు చేయకపోతే అదే పదివేలు. ఈవిధమైన భావాలు భగవద్భావం చేతనే అభివృద్ధిగాంచునుగానీ ప్రాకృతమైన భావంచేత పరోపకార భావములు, విశాలమైన భావములు, సున్నితమైన భావములు, పవిత్రమైన భావములు మానవునియందు అభివృద్ధి అగుటకు ఏమాత్రము అవకాశము లేదు. కనుక ప్రతి మానవునియందు దివ్యభావములు, నవ్యమైన భావములు అభివృద్ధి గావించుకోవాలి. ఇట్టి దివ్యభావములనభివృద్ధి గావించుకుని తద్వారా జగత్తునకు అందించే నిమిత్తమై ప్రాచీన కాలమునుండి మహర్షులు ఇలాంటి యజ్ఞయాగాది క్రతువులనే కర్మలచేత పవిత్రమైన ప్రచార ప్రబోధలు సలుపుతూ వచ్చారు.

ప్రేమస్వరూపులారా! భగవంతునియొక్క తత్త్వము అంతసులభముగా అర్థమయ్యేది కాదు. నిత్య జీవితములో మనము సత్యమైన విషయాన్ని లోతునకు దిగి విచారించినప్పుడు ఎవరికి

srisathyasaivachanamrutam

వారికే ఇది దోషమని, ఇది మంచిదని మన ఆత్మసాక్షిగా మనం నిర్ణయం చేసుకోవచ్చు. ఏదో ఒక ఉద్రేకము చేతనో లేక ఒక ఆదేశము చేతనో ఎవరినైనా మనము అనరాని మాటలు అనవచ్చు. తదుపరి శాంత పడిన తరువాత చల్లబడిన తరువాత తనయొక్క హృదయమే తనను బాధింపచేస్తుంది. ఎంతటి మాటలు అన్నాను ఇదినాది తప్పు అని తనకు తాను పశ్చాత్తాప పడతాడు. కానీ ఆ పశ్చాత్తాపాన్ని బయటకు నిరూపించడు. అది అప్పటికి మాత్రమే అణగద్రొక్కుతాడు. నిజముగా శాశ్వతమైన పశ్చాత్తాపమే ఉంటే మరొక తూరి అలాంటి మాటలకు తాను పూనుకోడు. దోషములు చేయటం పశ్చాత్తాప పడటం, పశ్చాత్తాపం దోషములు చేయటం + − + − = 0 ఇంతే మన జీవితము. ఈనాటి జగత్తునందు దినమూ తప్పులు చేయటం ఆ తప్పులు తప్పులని భావించటము తిరిగి రెండవ దినము తప్పులు చేయటము. ఈ తప్పులను తప్పులుగా పశ్చాత్తాప పడినటువంటివాడైతే రెండవ దినము తిరిగి ఈ తప్పులలో ఎందుకు ప్రవేశిస్తున్నాడు. కనుక తెలిసో తెలియకో ఒకతూరి దోషములు చేసినపుడు తిరిగి అట్టి దోషములు రాకుండా చూసుకోవాలి. ఇదియే నిజమైన మానవత్వముయొక్క సత్యతత్త్వము. ప్రతి విషయమునందు కూడను, ప్రతి వాక్కునందు కూడను, ప్రతి చర్యయందు కూడను దివ్యత్వమనే చైతన్యము అన్నింటియందు వ్యాప్తియై ఉన్నదనే సత్యాన్ని మనం విశ్వసించాలి. తత్‌జలాన్ అనేటువంటి దానిలో ఈ దేహము, మనసు, ప్రాణము ఈ మూడింటియందు ఉన్న ప్రజ్ఞను మనం చక్కగా విచారించుకోవాలి. అదియే ప్రజ్ఞానం బ్రహ్మ అన్నారు. అదే constant intergrated awareness. అలాంటి ప్రజ్ఞ మన వెంటనే జంటనే ఇంటనే ఉండికూడను దానిని గుర్తించుకోలేకపోవటమనేది ఇంతకంటె గొప్ప అజ్ఞానము మరొకటి లేదు.

**కృతజ్ఞతతో ఉండండి**

ఇది కేవలం చదువులతో లభ్యమయ్యేది కాదు. లేక గ్రంథములతో మనం నేర్చుకోవలసినది కాదు. నిత్య జీవితములో మనయొక్క అనుభూతుల ద్వారా దీనిని అర్థం చేసుకోవాలి.

**ఎన్ని విద్యలు నేర్చియునేమి ఫలము**
**తననొసట వ్రాత తప్పింప తరము కాదు**
**చెడ్డబుద్ధులు తన తల చేరెనేని**

### బండ బారుమ బుద్ధులు ఎండబారు

ఎప్పుడు చూచినా ఇతరులను దూషించటము, ఇతరులను విమర్శించటము ఇది మానవునకు సరైనది కాదు. కేవలము దానవలక్షణము. ఇలాంటి గుణములు ఉన్న మానవుడు ఏనాటికిని శాంతిని అందుకోలేడు. తన తత్త్వాన్ని తాను మార్చుకోవాలి. తను మారక గృహమును మార్చుకొనక లోకమును మార్చుటకు ప్రయత్నించటమంటే కేవలము వెట్టితనము. దైవము సర్వత్ర ఉంటున్నాడనే విశ్వాసమును మొదట పెంచుకోవాలి. ఒక సైంటిస్టు సూర్యుని చూసి ఇది కేవలము హైడ్రోజన్ బాల్ అంటాడు. కానీ దివ్యమైన భగవత్ సాధకుడు ఆహా! సూర్యుడు లోకారాధకుడు. ఇతను ప్రత్యక్ష దైవము సూర్యుడే లేకపోతే సృష్టియే లేదు. సమస్త ఋతువులకు, దిన చర్యలకు రాత్రింబవళ్లు అంతా సూర్యుడే మూలకారణము అని. సూర్యారాధన సలుపుతూ ఉంటాడు. భక్తుడు సైంటిస్టుకు, సన్యాసికి ఉన్న వ్యత్యాసమెంతటిదో చూడండి. కేవలము హైడ్రోజన్ బాల్ అనుకొని అంతటితో తాను ముగించుకుంటే అవివేకి అతను. సమస్త శక్తులుకూడను సూర్యుని నుండియే ఆవిర్భవిస్తున్నాయి. ఇది ఒక బాల్ మాదిరి చూసుకొని అలక్ష్య పరుస్తున్నాడు. కృతజ్ఞత లేని కౄరులు వారు, సూర్యుడే లేకపోతే తానే లేడు. సూర్యుడే లేకపోతే తమ యొక్క పరిశీలనలు, పరిశోధనలు ఏమాత్రం చేయలేరు. ఇట్టి కృతజ్ఞత లేనివాడే మానవుడు అని. కనుక ప్రతి ఒక్కరుకూడను తాము పొందిన దానిని, తాము ఆనందించిన దానిని, అనుభవించిన దానిని ప్రత్యుపకారముగా మనం చేయాలి.

ఒక పచ్చని వృక్షమును చూసినప్పుడో, పచ్చని పర్వతములు చూసినప్పుడో భక్తుడు, ఆహా! ప్రకృతియొక్క సౌందర్యమెంత గొప్పది! ఈ సౌందర్యమంతా కూడా భగవంతునియొక్క సౌందర్యమని God is nature అంటాడు. ఒక సైంటిస్టు వస్తాడు. దీని పచ్చదనమంతాకూడను క్లోరోఫిల్ వల్ల వస్తుంది అనుకుంటాడు. ఈ క్లోరోఫిల్‌కు భగవంతుని సౌందర్యమునకు ఎంత తేడా ఉంటున్నదో చూడండి. వీళ్ళు అల్ప భావములందే పోతున్నారు. ఆధ్యాత్మిక భావములు, ఉన్నత భావములను వాడు అందుకుంటున్నాడు. గోడకట్టువాడు దినదినమునకు పైపైకే పోతుంటాడు. బావి త్రవ్వువాడు దిన దినానికి క్రిందకే పోతుంటాడు. Saints గోడ కట్టేవారు. దినదినానికి ఉన్నత భావములభివృద్ధి పరచుకొని ఉన్నతస్థాయికి చేరుతున్నారు. ప్రతిదానిని

ప్రకృతి క్రిందకి దిగజార్చుకుంటూ కేవలం బావి త్రవ్వే వాని మాదిరి పరిశీలన పరిశోధన. పరిశీలన, పరిశోధన అని క్రిందకే దిగిపోతున్నారు. సైన్సు టెక్నాలజీలో ఏమీ దోషంలేదు. కాని మానవునియొక్క మనస్సులోనే సర్వదోషములు ఉంటున్నాయి. అనుభవించవలసిన మార్గంలో అనుభవించాలి. చింతించవలసిన మార్గంలో చింతించాలి. అన్నింటిని అలక్ష్యపరచటం అహంకారముయొక్క స్వరూపము. సుందరయ్యర్ చెప్పినట్లుగా అహంకారము, ఆడంబరము ఉండినంతవరకు ఆత్మాభిమాన మనేది ఏనాటికి వారికి చేజిక్కదు.

ప్రేమస్వరూపులారా! అహంకారముకేమాత్రం అవకాశం లేదు మనలో. ఇంతటి విశాల ప్రపంచములో ఎంతటివారము మనము. ఆ భావముచేత అహంకారమున కవకాశము ఇవ్వకుండా చూసుకోవాలి. అందరియందు ఉన్న ఆత్మతత్త్వం ఒక్కటే అనే సమత్వాన్ని పెంచుకోవాలి. నీడలు వేరువేరుగా ఉండినట్లుగా దేహములు వేరువేరుగా ఉండవచ్చును. ఈ నీడకు ప్రక్కలో ఎండ ఉంటున్నది. ఎండనే లేకపోతే నీడనే ఉండదు. నీడలో కూడను ఎండయొక్క వెలుతురు ఉంటుంది కనుక ప్రతిదానికి కూడా side by side ఈ ఆత్మ తత్త్వమనేది ఉపాధి భేదము దూరం చేసినప్పుడు రెండూ ఒక్కటే అయిపోతాయి. దీనినే వేదాంతము తత్త్వమసి అన్నది. దీనికి దేహము ఉంది దానికి దేహము లేదు. ఈ దేహమనే ఉపాధి దూరము చేస్తే జీవుడు దేవుడూ ఒక్కడే. దేహము ఏమాత్రము కూడాలేదు.

**అందరూ సుఖంగా ఉండాలని కోరండి**

దివ్యాత్మ స్వరూపులారా! ఉన్నతమైన భావములను, ఉత్తమమైన మార్గములను అభివృద్ధిపరచుకొని అందరూ అన్యోన్యమైన దైవసంతతిగా మనం జీవించినప్పుడే లోకముకూడా ఎంతైనా సుఖసంతోషములను అనుభవిస్తుంది. ప్రాచీన కాలమునుండి భారతదేశము దేశదేశములకు ఆధ్యాత్మిక ప్రభావాన్ని, ప్రబోధలను అందించిన దేశము. కనుకనే ఆనాటి మొదలు నేటివరకు 'లోకాస్సమస్తా సుఖినో భవంతు' అందరూకూడా సుఖంగా ఉండాలనేదే మనహైందవ సాంప్రదాయము. ఎవరియందు కూడా మనం ఎట్టి దోషభావాన్ని పెట్టుకోరాదు. ఇది ఎవరికి ప్రమాదం కలుగుతుంది. ఈ దోషములున్నవారికే ప్రమాదము కలుగుతుంది. ఆ యొక్క reaction, resound తిరిగి వెనుకకే కొడుతుంది. ఇతరుల మంచిని మనం కోరుతూ



srisathyasaivachanamrutam

వస్తే తిరిగి దైవం మనం మంచికోరుతూ వస్తుంది. దీనినే తెలుగు వారు చెరపకురా చెడేవు అంటారు. ఇతరుల చెడుపును మనమేమాత్రం ఆశించరాదు. కనుక అందరి మంచిని మనం ఆశించి అందరి క్షేమాన్ని మనము కోరి దివ్యమైన ఆత్మభావముచేత జగత్తును మనం అనుభవించటానికి ప్రయత్నించాలి. పారమార్థిక దృష్టితో ప్రకృతిని మనం అనుభవించాలి. ఇదియే సర్వవేదముల యొక్క సారము. సర్వశాస్త్రములయొక్క మూలము. సర్వ గమ్యములయొక్క కీలకము. ఇదియే మానవస్థానము. ఇట్టి పవిత్రమైన స్థానమును మనమేమాత్రం దుర్వినియోగం చేయకూడదు. మనస్సును, వాక్కును, కర్మలను ఏకంగావించుకొనే విషయములో అనేక విధాలుగా మనము ప్రయత్నం సాగించాలి. అప్పుడే మనము నిజమైన మానవునిగా రూపొందుతాము. మనసులో ఒకటి, మాటలో ఒకటి, క్రియలో మరొకటి ఆచరించటానికి పోతే మనం నిజంగా దానవులుగా మారిపోతాము. బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి. దేనిని మనం ఆశిస్తున్నామో, దేనిని మనము చింతిస్తున్నామో ఆ చింతయొక్క స్వరూపాన్నే మనము పొందుతాము. కనుక Be good. Do good, See good, This is the way to God. మంచిగా ఉండాలి. మంచిని చూడాలి. మంచిని చెప్పాలి. ఇదే నిజమైన భావము, నిజమైన భక్తి, నిజమైన బ్రహ్మతత్త్వము.

**(తేది. 08-10-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam